## 11:40 దాటినా..
# ఖాళీ కుర్చీలే!

- సచివాలయంలో రెవెన్యూ ఉద్యోగుల తీరుపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఉదయం 11.40 దాటినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని, ఉద్యోగులు ఇంకా విధులకు హాజరుకాకపోవడమేంటి? అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సచివాలయంలోని రెవెన్యూ ఉద్యోగుల పనితీరును పరిశీలించేందుకు మంత్రి గురువారం ఉదయం 11:30 గంటలకు ఆ విభాగానికి వెళ్లారు. అక్కడి పరిస్థితిని చూసి విస్మయం వ్యక్తంచేశారు. ఐదు సెక్షన్లలో చాలా కుర్చీలు ఖాళీగానే దర్శనమిచ్చాయి. హాజరు పట్టికలను పరిశీలించి, అధికారులను ఆరా తీయగా.. ఉద్యోగులు ఇంకా హాజరు కాలేదని తేలింది. ఇందులో కొందరు కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఆఫీసుకు రాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. '11:40 గంటలకు కూడా ఉద్యోగులు విధులకు రాకపోవడం బాధ్యతారాహిత్యమే. దీన్ని సహించేది లేదు' అని హెచ్చరించారు. విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఎస్‌ఎల్‌బీసీని త్వరగా పూర్తిచేయాలి

- అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- నల్లగొండ ప్రాజెక్టుల పురోగతిపై ప్రత్యేక సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఎస్‌ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సచివాలయంలోని తన చాంబర్‌లో గురువారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జా, ఇతర ఉన్నతాధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ద్వారా ప్రాజెక్టుల పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, డిండి ప్రాజెక్టు పూర్తిచేయాలని ఆదేశించారు. 9 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు జరగాల్సి ఉన్నదని, సొరంగానికి ఇరువైపులా వెంటనే పనులు చేపట్టి రెండేండ్లలో పూర్తి చేయాలని సూచించారు. సాంకేతిక పనుల పూర్తికి, ఇతర సమస్యల పరిష్కారానికి అధికారుల బృందంతో కమిటీ వేయాలని రాహుల్ బొజ్జాను ఆదేశించారు. డిండి, పెండ్లిపాకాల రిజర్వాయర్ల పనులు దాదాపు 95 శాతం మేరకు పూర్తయ్యాయని, భూసేకరణకు మరో రూ.90 కోట్లు అవసరమని, పర్యావరణ, అటవీ అనుమతులు వచ్చేలా పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ప్రతివారం సమీక్షలు చేయాలని, ఏజెన్సీలు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

**రిజర్వాయర్లపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తి**

విద్యుత్తు డిమాండ్‌ను తీర్చడానికి జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లతో విద్యుదుత్పత్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

# సూపర్ స్పెషాలిటీల్లో వైద్యసేవలకు కమిటీ

- దవాఖానల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ దవాఖానల్లో వైద్యసేవలు అందించేందుకు సాంకేతిక కమిటీని నియమించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. దవాఖానల నిర్మాణ పనుల పురోగతిపై గురువారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దవాఖానల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని సూచించారు. వరంగల్‌లో 2,100 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్‌లోని అల్వాల్‌లో 1200 పడకలు, ఎల్బీనగర్, సనత్‌నగర్‌లో 1000 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిమ్స్‌లో 2 వేల పడకలతో చేపట్టిన విస్తరణ పనుల పురోగతిపై సమీక్ష జరిపారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి, వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తూ, డీఎంఈ వాణి, అడిషనల్ డీఎంఈ శివరాం ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహేందర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యల చేయొద్దు

**టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం**

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిపై ఎలాంటి అనుచిత వాఖ్యలు చేయరాదని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులోని 11వ అదనపు జడ్జి ఆర్ డ్యానీరుత్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు న్యాయవాది రాపోలుభాస్కర్‌పై మహేందర్‌రెడ్డి దాఖలుచేసిన పరువునష్టం కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ పరువుకు భంగం కలిగించేలా వ్యాఖలు చేయరాదని, వీడియో, ఆడియోలను, వ్యాసాలను, సభల్లో సమావేశాల్లోకానీ, ఇంటర్వ్యూల్లో, సామాజిక మాధ్యమాల్లో, టీవీ ఛానళ్లలో పత్రికాముఖంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయరాదని ఆదేశించింది. తనపై న్యాయవాది చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, పేరు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లేవిధంగా తప్పుడు ఆరోపణలు చేశారని పిటిషనర్ కోర్టుకు వివరించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టు తప్పుడు సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తున్నారని తెలిపారు. దీంతో తదుపరి విచారణ పూర్తయ్యేవరకు సంయమనం పాటించాలని రాపోలు భాస్కర్‌కు కోర్టు సూచించింది. తదుపరి విచారణను మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది.

















